క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని సంతోషిమాత ఆలయ ఆవరణలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లాల్‌కమాన్, సిద్దిపేట ట్రాన్స్‌పోర్ట్ ఏరియా, సుబాష్‌రోడ్డు, సంతోషిమాత ఆలయ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందులు అందుబాటులో లేవు


ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాలలోని ఆరోగ్య కేంద్రాలలో సాధారణ మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యాదగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రం, లద్నూరు ఉప ఆరోగ్య కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టెల్మా, ఆమ్లా, బీపీ మాత్రలు డీపీటీ తదితర మాత్రలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొద్ది నెలలుగా సబ్ సెంటర్‌లకు మందులు సరఫరా చేయడం లేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, పరమేశ్, కిష్టయ్య, శివశంకర్, సురేశ్, బాబు, నర్సింహులు, రాజు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల్లా బెల్ట్‌షాపులు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుస్నాబాద్: గ్రామాల్లో బెల్ట్ షాపులు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయని, వాటిని నియంత్రించాలని బీఎస్పీ నాయకులు శనివారం ఎక్సైజ్ సీఐ పవన్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో వందల సంఖ్యలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నార న్నారు. దీంతో యువత మత్తుకు బానిసై రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయిస్తున్న వారిని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, నాయకులు శంకర్, సుధాకర్, సాంబరాజు పాల్గొన్నారు.

శిఖం భూమిని కాపాడండి సారూ..


మాట్లాడుతున్న వీరారెడ్డిపల్లి గ్రామస్తులు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి చౌదరి చెరువు శిఖం భూమిని కబ్జాచేసి విక్రయాలకు పాల్పడుతున్నారని, రెవెన్యూ అధికారులు సర్వేచేసి కబ్జాదారుల నుంచి కాపాడాలని వీరారెడ్డిపల్లి గ్రామస్తులు కోరారు. గ్రామంలో శనివారం వారు మాట్లాడుతూ 147 సర్వే నంబరులో గల చెరువు శిఖం భూమిలో కొందరు వ్యవసాయం చేసుకుంటున్నారని, అయితే ఇప్పుడు దానిని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించారని వాపోయారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని, ఇకనైన అధికారులు స్పందించి ఆ భూమిని రక్షించాలని కోరారు.

సహాయ నిధి కోతతో ఇబ్బందులు


చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ముఖ్యమంత్రి సహాయనిధి సాయంలో కోత పెట్టడం వల్ల పేదలు ఇబ్బందిపడుతున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని 47 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గజ్వేల్‌కు చెందిన గుంటుకు బాలకృష్ణ చికిత్సకు రూ.47 లక్షలు ఖర్చుచేసి బిల్లులు అందజేస్తే కేవలం రూ.60 వేలు మాత్రమే మంజూరు చేశారన్నారు. ఇప్పటికైనా సాయం పెంచి పేదలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజమౌళి, మధు, నవాజ్‌మీరా, మెట్టయ్య, రాజు, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

తలరాతను మార్చేది చేతిరాతే

- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి
- అంబిటస్ పాఠశాల, సాక్షి వేసవి శిక్షణ శిబిరం
- ఉత్సాహంగా ముగింపు కార్యక్రమం
- చిన్నారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు


శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో డీఈఓ, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు

సిద్దిపేటకమాన్: చేతిరాత మన తలరాతను మారుస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంబిటస్ పాఠశాల, సాక్షి మీడియా సంయుక్త ఆధ్వర్యంలో భరత్‌నగర్‌లోని అంబిటస్ పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 5న ప్రారంభమైన ఈ శిబిరం 15 రోజుల పాటు కొనసాగింది. సుమారు 100 మందికిపైగా విద్యార్థులు పాల్గొని కరాటే, యోగా, డ్యాన్స్, చేతిరాత, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ తీసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ శిబిరం కొనసాగింది. ప్రతిభ కనబర్చిన వారికి డీఈఓ బహుమతులు అందజేసి, ప్రశంసాపత్రాలతో అభినందించారు.

చిన్నారులకు ఎంతో ఉపయోగం

కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ వేసవి కాలంలో ఇలాంటి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో కూడా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం, సాక్షి మీడియా గ్రూపు సిబ్బందిని అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, కరస్పాండెంట్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే యేడాది కూడా 300 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రావు, శిక్షణ శిబిరం ఇన్‌చార్జి, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ అపర్ణ, స్పోకెన్ ఇంగ్లిష్ టీచర్ సాయికృప, చేతిరాత టీచర్ శ్రీజ, కరాటే మాస్టర్ భాగ్యరాజ్, డ్యాన్స్ మాస్టర్ వాసుదేవ్, సాక్షి సీనియర్ రిపోర్టర్లు షణ్ముఖరాజు, చంద్రమౌళి, ఇంద్రసేనారెడ్డి, శ్రీకాంత్, సతీశ్, కుమార్, సంతోష్, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పక్కన అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

ఎంతో ఆసక్తి చూపారు..


ఈ వేసవి శిక్షణ శిబిరంలో వంద మందికి పైగా చిన్నారులు పాల్గొని ఎంతో ఆసక్తితో కొత్త విషయాలు నేర్చుకున్నారు. పిల్లలు సెల్‌ఫోన్, టీవీలు, సోషల్ మీడియాకు అడిక్ట్ కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– అపర్ణ, శిక్షణ శిబిరం ఇన్‌చార్జి, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్

చాలా సంతోషంగా ఉంది


ప్రస్తుతం తొమ్మిదో తరగతి పూర్తి చేశాను. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై మెళకువలు నేర్చుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. నిర్వాహకులకు ధన్యవాదాలు.

– నిత్యముక్త, విద్యార్థిని

కరాటే నేర్చుకున్నా..


అంబిటస్ పాఠశాలలో ప్రస్తుతం రెండో తరగతి పూర్తిచేశాను. వేసవి సెలవుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలని అమ్మ క్లాసులకు పంపించింది. మా అక్కతో కలిసి ప్రతిరోజు ఉదయం గంటపాటు కరాటే నేర్చుకున్నాను.

– అశ్విన్‌కుమార్, విద్యార్థి

రక్తపోటుపై జాగ్రత్తలు అవసరం


మాట్లాడుతున్న ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శాంతి, హెచ్‌ఓడీ మాధవ్

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శాంతి

సిద్దిపేటకమాన్: రక్తపోటు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శాంతి, హెచ్ఓడీ, అసోసియేట్ ప్రొఫెసర్ మాధవ్ సూచించారు. వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్యాధికారులు, సిబ్బంది శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 45 యేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు అరగంట పాటు నడక, యోగా, ధ్యానం చేయాలని సూచించారు. మానసిక రోగాలు, ఒత్తిడి వల్ల బీపీ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. బీపీ కంట్రోల్‌లో లేకపోతే గుండెపై ఒత్తిడి పెరిగి అనారోగ్యం భారిన పడతారని వివరించారు. మొహంలో వాపు వచ్చినా, కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించినా వెంటనే బీపీ పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. గుట్కా, మద్యం, పొగతాగడం వంటి వాటికి దూరంగా ఉంచాలని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ గీత, వైద్యులు మురళీకృష్ణ, సంధ్య, జ్యోతి, స్నేహిక, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా గోపాల్ బాధ్యతలు


గోపాల్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి డిప్యూటీ తహసీల్దార్ గోపాల్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల మిరుదొడ్డికి బదిలీకాగా బెజ్జంకి తహసీల్దార్ బాధ్యతలను గోపాల్‌కు అప్పగించారు.

చేర్యాల తహసీల్దార్‌గా

చేర్యాల(సిద్దిపేట): స్థానిక తహసీల్దార్‌గా దిలీప్‌నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సమీర్ అహమ్మద్‌ఖాన్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కొండపాక తహసీల్దార్‌గా పనిచేసిన దిలీప్‌ను నియామిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు

హిందూ ఏక్తా యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): కరీంనగర్‌లో 22వ జరగనున్న హిందూ ఏక్తా యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువులంతా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రావు, రవీకుమార్, మోహన్‌నాయక్, తిరుపతి నాయక్, శ్రీనివాస్, అనిల్‌నాయక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

సీపీఐ జిల్లా నేత అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

చేర్యాల(సిద్దిపేట): సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపునిచ్చారు. మండలంలోని వేచరేణిలో శనివారం గ్రామశాఖ మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఆవిర్భవించినదే సీపీఐ అన్నారు. వేచరేణి నుంచి చేర్యాలకు వెళ్లేమార్గంలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.96 కోట్లు మంజూరైనప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎంపికచేశారు. గ్రామ కార్యదర్శిగా ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా బస్వరాజు నాగరాజు, ఎండీ హబీబ్, కోశాధికారిగా కనకయ్య, సోషల్ మీడియా అధ్యక్షుడిగా నరేశ్, ప్రచార కార్యదర్శిగా రాజయ్యను నియమించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ బిహార్ పోలీసుల తీరు దారుణం

సిద్దిపేటజోన్: రాహుల్ గాంధీపై బిహార్ పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ముస్తాబాద్ చౌరస్తాలో శనివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు వహబ్ మాట్లాడుతూ దర్భంగాలో రాహుల్ గాంధీపై అనుచితంగా వ్యవహరించారన్నారు. గయాజ్, రాజిరెడ్డి, ప్రవీణ్, అనిల్, నవీన్ పాల్గొన్నారు.

◆ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ ఏజీ రహీం ఆదేశించారు. మండలంలోని గాగ్గిళ్లాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానలను దృష్టిలో పెట్టుకొని నిర్వాహకులు కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు.

◆ ఫంక్షన్‌హాల్ అధ్యక్షుడిగా రాములు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీకృష్ణయాదవ సంఘం ఫంక్షన్‌హాల్ అధ్యక్షుడిగా బైతిరాములు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ యదవ సంఘం ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన ఎన్నికలలో 950 మంది సభ్యులు పాల్గొని, తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గెలుపొందిన అధ్యక్షులు, డైరెక్టర్లను సభ్యులు ఘనంగా సన్మానించారు.

◆ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ములుగు(గజ్వేల్): బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర యువజన కార్యదర్శి చింతల అరుణ్‌రెడ్డి కోరారు. మండలంలోని వంటిమామిడిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రజలు విశ్వసించారని, అన్ని వర్గాల ప్రజలు యువత సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యం, కన్నారెడ్డి, మహేశ్‌గౌడ్, సాయికిరణ్, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ త్వరలో మున్నూరు కాపు సంఘం ఎన్నికలు

సిద్దిపేటకమాన్: మున్నూరు కాపుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య, రాష్ట్ర నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. త్వరలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎల్లం, బాలయ్య, రాజయ్య, మురళి, పాండు తదితరులు పాల్గొన్నారు.

◆ 8 వేల కిలోల బెల్లం పట్టివేత

హుస్నాబాద్‌రూరల్: మహారాష్ట్ర నుంచి హుస్నాబాద్‌కు రవాణా చేస్తున్న బెల్లం లారీని శనివారం పట్టుకున్నట్లు సీఐ పవన్ తెలిపారు. మెదక్ డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ లారీ పట్టుబడినట్లు చెప్పారు. హుస్నాబాద్ కవిత కిరాణా దుకాణం యాజమాని వెంకటేశ్‌కు కరీంనగర్, హుజురాబాద్‌లోని ఇద్దరు వ్యాపారులకు బెల్లం, పటికను సరఫరా చేస్తున్నట్లు లారీ డ్రైవర్ అంగీకరించినట్లు తెలిపారు. 8 వేల కిలోల బెల్లం, 200 కిలోల పటికను స్వాధీనం చేసుకుని కవిత ట్రేడర్స్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


భూమిపూజ చేస్తున్న వెంకటయ్య, వెన్నెల తదితరులు

రాజ్యాంగం అమలుకు పోరాడిన గద్దర్

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల

ములుగ(గజ్వేల్): రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేసేందుకు పోరాడిన మహనీయుడు గద్దర్ అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సాంస్కృతిక సారథి చైర్మన్ వి.వెన్నెల అన్నారు. మండలంలోని మామిడ్యాల ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గద్దర్ విగ్రహాల ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. గ్రామ అబేడ్కర్ సంఘం అధ్యక్షుడు సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇద్దరు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా యువత వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. విగ్రహాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన అంబేడ్కర్ సంఘం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, నాయకులు శ్రీహరియాదవ్, శ్రీనివాస్, స్వామి, దేవేందర్, నర్సింహులు, పోచయ్య, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తయ్యచారి, వీరేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తం: షీ టీమ్



బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న షీ టీమ్, పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ షీ టీమ్ సభ్యులు సూచించారు. స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, అపరిచితులతో పరిచయాలు, సోషల్ మీడియా గురించి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మాయ మాటలు నమ్మవద్దన్నారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మహిళల భద్రతే పోలీసుల లక్ష్యం అన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ షీ టీమ్, హెడ్ కానిస్టేబుల్ సైదయ్య, మహిళా కానిస్టేబుల్స్ ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులు తప్పనిసరి


రైతులకు సూచనలిస్తున్న అంజనేయులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆయిల్‌పామ్ తోటల్లో తప్పని సరిగా వేసవిలో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు రైతులకు సూచించారు. మిరుదొడ్డిలోని ఆయిల్‌పామ్ తోటలను శనివారం ఆయన పరిశీలించారు. వేసవిలో ఆయిల్‌పామ్ తోటల్లో నీటి యాజమాన్యం, ఎరువులు వేసుకునే పద్ధతులు, కోతకు వచ్చిన గెలల కటింగ్ విధానం, ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీకి తరలింపు గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలను సాగుచేసి మరింత ఆదాయాన్ని సాధించవచ్చన్నారు. అలాగే ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నారని చెప్పారు. జిల్లాలో 12వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్న నేపథ్యంలో నంగునూర్ మండలంలో త్వరలోనే ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి రానుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ భక్తుల శోభాయాత్ర


హుస్నాబాద్: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న హనుమాన్ భక్తులు

హుస్నాబాద్/బెజ్జంకి(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట): హనుమాన్ మాల ధరించిన భక్తులు శనివారం భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. హుస్నాబాద్‌లో ఆంజనేయుని విగ్రహాన్ని ఊరేగించారు. హనుమాన్ కీర్తలను ఆలపిస్తూ నృత్యాలు చేశారు. అలాగే బెజ్జంకిలో భారీ హనుమాన్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

అయినాపూర్ హోమం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లోని ఆజనేయ ఆలయంలో మాల ధరించిన స్వాములు ఘనంగా భక్తాంజనేయ హోమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ రాజు మాట్లాడుతూ హనుమాన్ దీక్ష ఎంత నిష్టతో చేస్తున్నారో.. అదేవిధంగా రోడ్డు భద్రత విషయంలోను జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, పోలీసు సిబ్బంది, స్వాములు పాల్గొన్నారు.

మల్లన్నకు ఎస్‌బీఐ మేనేజర్ పూజలు


మల్లన్న సన్నిధిలో వివేక్ చంద్రాజైశ్వాల్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ వివేక్ చంద్రాజైశ్వాల్ శనివారం దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనకు శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమురవెల్లిలో ఎస్‌బీఐ బ్రాంచి ఏర్పాటు చేయడం వల్ల భక్తులకు సౌకర్యవంతంగా ఉందన్నారు. ఆలయానికి ఒక లాకర్‌ను అందజేయనున్నట్టు ప్రకటించారు. ఆయన వెంట సిద్దిపేట ఏజీఎం అరణ్‌జ్యోతి, జోనల్ అధికారి సంతోష్ కుమార్, స్థానిక బ్రాంచి మేనేజర్ క్రాంతి, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి


ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

ఏసీపీ సదానందం

హుస్నాబాద్: యువత సన్మార్గంలో నడవాలని ఏసీపీ సదానందం సూచించారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ, టీచర్స్ కాలనీలో శనివారం నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 78 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు అభిలాష్, విజయ్‌భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినులకు సన్మానం


విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కుమార్

మిరుదొడ్డి(దుబ్బాక): ఏపీ ఈసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి, రెండో ర్యాంకులు సాధించిన విద్యార్థినులు కట్లి రేవతి, పంజా నవ్యను చార్వాక మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో శనివారం స్కూల్ ప్రిన్సిపాల్ ధర్మారం కుమార్ మాట్లాడారు.